నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | మే 17, 2024 | www.navatelangana.com

ఈపాస్ మిషన్‌తో ఎరువులు పంపిణీ

- జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

రైతులకు ఈపాస్ మిషన్ ద్వారానే ఎరువులను పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి ఆదేశించారు. గురువారం నాగిరెడ్డిపేట్ మండలంలోని మాల్ తుమ్మెద, తాండూర్ సొసైటీలను సందర్శించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్‌లను ఆమె తనిఖీ చేశారు. ఈపాస్ మిషన్ ద్వారా బయోమెట్రిక్ విధానంతో రైతుల ఆధార్ కార్డు వివరాలను నమోదు చేసి ఎరువులను పంపిణీ చేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్ లను ఎప్పటికప్పుడు మెయింటైన్ చేయాలని సీఈఓ లకు ఆమె ఆదేశించారు. వానాకాలం సీజన్‌కు సంబంధించిన పచ్చి రొట్టె ఎరువులు రైతులకు 60 శాతం సబ్సిడీ పైన అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి విజయ శేఖర్ సిఈవో జైపాల్ రెడ్డి ఉన్నారు.

ఆర్మూర్‌లోని జీవన్‌రెడ్డి మాల్‌సీజ్



నవతెలంగాణ-ఆర్మూర్

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని జీవన్‌రెడ్డి మాల్‌ను టీఎస్ ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు గురువారం సీజ్ చేశారు. ఉదయం వచ్చిన అధికారులు మైక్ ద్వారా అనౌన్స్ చేసి సాయంత్రం 5.30 గంటల సమయంలో అందులో ఉన్న వాళ్లను బయటకు పంపి ప్రధాన గేటుకు తాళం వేశారు. ఈ మాల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి కుటుంబ సభ్యుల పేరు మీద ఉంది. ఇటీవల మాల్ సీజ్ చేస్తామని అధికారులు ప్రకటించగా, ఎన్నికల వేల తనపై కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో ఆర్టీసీ అధికారులు ఆయన ఆరోపణలపై వివరణ సైతం ఇచ్చారు. తాము చట్ట ప్రకారంగానే మాల్ పై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో తాజాగా మాల్‌సీజ్ చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

నూతన స్తంభం ఏర్పాటు

- నవతెలంగాణ కథనానికి స్పందించిన విద్యుత్ శాఖ



నవతెలంగాణ-కామారెడ్డి

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతో వరి ఎండిపోవడంపై ఈ నెల 10వ తేదీనా నవతెలంగాణలో ప్రచురించిన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. పడిపోయిన స్తంభం చోట గురువారం మరో స్తంభాన్ని ఏర్పాటు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. పలు మార్లు ఏఈ, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, నవతెలంగాణతో వచ్చిన కథనంతో అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నట్లు స్థానిక రైతు కొట్టాలపల్లి సిద్ధం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నవతెలంగాణకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు ఆశలపై నీళ్లు

- నిజాంసాగర్ కాలువలు శిథిలావస్థం
- ప్రధాన కాలువలకు రక్షణ కరువు
- సాగునీరు విడుదలలో రాజకీయ జోక్యం
- రైతుల ఆందోళన



నిజాంసాగర్ కాలువ పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయి. నిజాంసాగర్ నీటి విడుదలలో రాజకీయం జోక్యం చేసుకోవడంతో అధికారులు తికమక పడుతున్నారన్నారు. నిజాంసాగర్ ప్రధాన కాలువలో పూడిక మట్టి దిబ్బలు పెరగడం, ప్రధాన కాలువలు, పిల్ల కాలువలు శిథిలావస్థకు చేరడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందుతుందో లేదో అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రైతాంగానికి వరప్రదాయినిగా నిలిచిన నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం 17 టీఎంసీల సాగు నీరు నిల్వ ఉంటుంది. ప్రాజెక్ట్ కింద ఆయకట్టు విస్తీర్ణం 2.75 లక్షల ఎకరాల వరకు ఉంటుంది. నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ పొడవు 155 కిలోమీటర్లు ఉండగా.. 82 డిస్ట్రిబ్యూటర్ కాలువలు ఉన్నాయి. 283 సబ్ డిస్ట్రిబ్యూటర్ కాలువలు 283 పిల్ల కాలువలు ఉండగా.. 1771 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. బాన్సువాడ నియోజకవర్గం పరిధిలో బాన్సువాడ, నసురుల్లాబాద్, బీర్కూర్, వర్ని, కోటగిరి, పోతంగల్, చందూర్ తదితర మండలాల భూములు ప్రాజెక్టు కాలువ ఆయకట్టు కింద రైతులు సుమారు 80 వేల ఎకరాల్లో పంటలను చేస్తున్నారు.

ఖరీఫ్ సాగు కోసం నిజాంసాగర్ ప్రాజెక్టులో సాగునీరు నిల్వ కోసం ఉంచేవారు. సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ఖరీఫ్ మే, జూన్ మాసంలో నారుమళ్లు వేసుకునేందుకు సాగునీరు అవసరం ఉండాలని పలు సార్లు అధికారులకు ఎమ్మెల్యే పోచారం సూచించేవారుజ రైతులకు సాగునీరు అవసరం లేక పోయినా అధికారులు ఏప్రిల్ మాసంలో సాగునీరు విడుదల చెయ్యడంతో ప్రస్తుతం ఈ నెలలో నీరు ఉంటుందో లేదో అని రైతులు ఆందోళన చెందారు.

మున్నాళ్ల ముచ్చటగానే మరమ్మతు పనులు..



నిజాంసాగర్ ప్రధాన కాలువ పరిధిలో చేపట్టిన మరమ్మతు పనులు మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతున్నాయి. పనులు నిబంధనల మేరకు చేయకపోవడంతో రూ. లక్షలు వెచ్చించినా ఆయకట్టుదారులకు కష్టాలు తప్పడం లేదు. లక్షలు వెచ్చించి సిమెంట్ పనులు, కాలువ కట్టలు పటిష్టపరిచే పనులు చేపట్టారు. యంత్రంతో అక్కడక్కడ నామమాత్రంగా పనులు చేసి మమ అనిపించారు. కాలువ అడుగున పూడిక పూర్తిగా తీయాల్సి ఉండగా, ఒకవైపు మాత్రమే తీయడంతో మట్టి దిబ్బలు, పిచ్చిమొక్కలు పెరిగి నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి.

నిజాంసాగర్ కాలువలు శిథిలావస్థం..

చివరి ఆయకట్టుకు సాగునీరు అందించడం కోసం ప్రభుత్వాలు కోట్లది రూపాయలు ఖర్చు చేసిన లక్ష్యం నెరవేరడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంగా పనులు చెయ్యడంతో కాలువ మరమ్మతు పనుల్లో నాణ్యత లోపిస్తుంది. దీనితో నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ అక్కడక్కడ శిథిలావస్థకు చేరుకుంది. ప్రధాన కాలువలో పూడిక మట్టి దిబ్బలు పెరిగి పోవడంతో సాగునీటికి అవాంతరాలు ఎదురైతున్నాయి. నిజాంసాగర్ మండలం సింగీతం వంతెన వరకు ప్రధాన కాలువ శిథిలావస్థకు చేరుకుంది. బాన్సువాడ మండలం బోర్లం నుంచి రాంపూర్, అంకోల్ తండా, సంగెం, బొమ్మన్ దేవ్ పల్లి నసురుల్లాబాద్ వద్ద ఉన్న ప్రధాన కాలువల్లో పూడిక మట్టి పెరిగిపోయింది. గత రెండు మూడు సంవత్సరాల నుండి మట్టి దిబ్బలు మరింత పెరగడంతో సాగునీటికి ఆటంకం ఏర్పడుతుంది దీనితో తరచూ ప్రమాదాలు జరుగుచున్నవి. చివరి ఆయకట్టుకు సాగునీటి ఎద్దడి ఎదురవుతుందని రైతులు భయపడుతున్నారు.



నిర్లక్ష్యం.. ఇష్టారాజ్యం

ఆయకట్టు చివరి భూములకు నీరు అందించడానికి ప్రధాన కాలువకు , డిస్ట్రిబ్యూటర్ కాలువలకు సిమెంట్ పనులు చేపట్టారు. అధికారులు నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల ఇష్ట రాజ్యంతో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా సిమెంటు పనులు చేపట్టడంతో మూడు నెలల ముచ్చటగానే పగుళ్ళు ఏర్పడి విలువైన సాగునీరు వథాగా పోతుంది. డిస్ట్రిబ్యూటర్ తూములు సక్రమంగా లేకపోవడం పిల్ల కాలువలు మరమ్మతులు చేపట్టకూడదు. విలువైన నీరు వథాగా పోయి మంజీరా నదిలో కలుస్తుంది. సాగునీరు వృథాగా పోతుందని రైతులు పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది.

కాలువలు కబ్జా.. 100 ఫీట్ల నుంచి 20-30 వరకు..

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు వరప్రదాయనిగా నిలిచిన నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువకు రక్షణ కరువైంది. ప్రజా ప్రతినిధుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం, కబ్జాదారుల ఇష్టారాజ్యంగా ప్రధాన కాలువ పక్కన ఉన్న కట్టను తవ్వి సాగుభూములుగా మారుతున్నాయి. అయినా నీటిపారుదల అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు గాని కాలువను ఎందుకు తవ్వేస్తున్నారు అంటూ ఎవరు ప్రశ్నించేవారు కరువయ్యారు. నిజాంసాగర్ ప్రధాన కాలువ కట్ట వెడల్పు 100 ఫీట్లు ఉండగా ప్రస్తుతం 20-30 సీట్లకే పరిమితమైంది. నిజాంసాగర్ ప్రధాన కాలువ కట్ట బలహీనత కావడంతో సాగునీరు చివరాయకట్టుకు అందకుండా పోతుంది. ఇప్పటికైనా నీటిపపారుదల శాఖ అధికారులు నిజాంసాగర్ ప్రధాన కాలువ కట్ట భూములను తవ్విన కబ్జాదారుల నుంచి విముక్తి కలిగించి కట్టకు మరమతు జరపాలని రైతులు కోరుతున్నారు.

ముందస్తుకు సాగునీరు..

ప్రకతి వైపరీత్యాలకు తట్టుకునేందుకు రైతులు ముందస్తు వరి సాగు చేయాలంటూ గత కొన్ని ఏళ్లుగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి రైతులను చైతన్య పరుస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గం పరిధిలో గత కొన్ని ఎండ్లుగ ముందస్తు వరి సాగు చేస్తున్నారు. అందుకోసం మే మాసం నుంచి జూన్ మాసంలో వరి నారూమల్లు వేసుకునేందుకు ముందస్తుగా నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేసేవారు. దీనితో మే మాసం నుంచి వరి నారుమల్లు వేసుకుంటారు. బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్, నసురుల్లాబాద్, బాన్సువాడ మండలంలో ఇప్పటికీ అక్కడికక్కడ నారుమళ్లు వేసుకున్నారు. నిజాంసాగర్ చివరి ఆయకట్టు రైతులకు సాగునీటినందించాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. శిథిలావస్థకు చేరిన కాలువలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

తురుగు పేరుతో మోసం

- నిర్వహాకులు, రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి
- సీపీఐ(ఎం) కార్యదర్శి వెంకట్ గౌడ్ డిమాండ్



మాట్లాడుతున్న సిపిఐ(ఎం) కార్యదర్శి వెంకట్‌గౌడ్

నవతెలంగాణ-గాంధారి

తరుగు పేరుతో రైతులను మోసం చేసిన కొనుగోలు కేంద్రం సిబ్బందిపై రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్య దర్శి వెంకట్ గౌడ్ డిమాండ్ చేశారు. గాంధారి మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మా ట్లాడుతూ గాంధారి మండలంలో కోనుగోలు కేంద్రం వద్ద రైతుల ఇబ్బందులు తెలుసుకున్నా మని సిబ్బంది, రైస్‌మిల్లర్లు కుమ్మక్కై రైతులను నిలువునా ముంచుతున్నారని తెలిపారు. ఇదే పరిస్థితి జిల్లాలో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తమ పంటను అమ్ముకోవడానికి నానా కష్టం పడుతున్నారని అటువంటి రైతులను ఆసరా చేసుకుని పండించిన పంటను తొందరగా పంపించడం కోసం తరుగు పేరు మీద రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న కొంతమంది సిబ్బంది అదేవిధంగా రైస్ మిల్ యజమానులు కుమ్మక్కై రైతులను క్వింటాలకు 5 కిలోల చొప్పున తరుగు పేరుతో మోసం చేసి పంటను తరలిస్తున్నారని ఇటువంటి తరుగు పేరుతో మోసం చేస్తున్న వారిపై కలెక్టర్ స్పందించి సరైన దర్యాప్తు జరిపించాలని కోరారు. తరుగు పేరుతో ఇప్పటివరకు ఎంత ధాన్యం రైస్ మిల్లర్లకు తరలించారో సంబంధించిన రైతులు అందరికీ ప్రతి కింటాలుకు ఐదు కిలోల చొప్పున ధర కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వర్షంతో తడిసిపోయిన ధాన్యాన్ని తూకం వేయాలని వారికి అధికతరుగును డిమాండ్ చేయకూడదని కోరారు. వర్ష సూచన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల వద్ద తగు ఏర్పాట్లు చేయాలని, తూకం వేసిన ధాన్యం సకాలంలో తరలించాలని రైతులకు టార్పలిన్ కవర్లు అందజేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కోర్ కమిటీ సభ్యులు మోతిరాం నాయక్, మండల నాయకులు ప్రకాష్, కిషన్ రావు, సాయిలు,మధు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన మిల్లులకు తరలించాలి

- ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ట్యాగింగ్ చేయాలి
- తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేయాలి
- అధికార యంత్రాంగం రైతులకు వెన్నుదన్నుగా నిలవాలి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్



దోమకొండ: ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్



కామారెడ్డిలో...

నవతెలంగాణ-దోమకొండ/బీబీపేట్/కామారెడ్డి

అకాల వర్షాలు పడుతున్నందున ధాన్యాన్ని త్వరత్వరగా ట్యాగింగ్ చేసిన మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. గురువారం పలు మండలాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ తో కలిసి పరిశీలించి తూకం వేసి సిద్ధంగా ఉంచిన ధాన్యపు బస్తాలను వెంటనే తరలించాలని, ఇందుకు అవసరమైన లారీలను కేంద్రాలకు పంపవలసినదిగా ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్ ను ఆదేశించారు.

ముందుగా మాచారెడ్డి మండలంలోని వేలుపు గొండ, ఫర్దీపేట, బీబీపేట, దోమకొండలలో కొను గోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి ధాన్యం లో తేమ శాతాన్ని కొలిచి, తూకం చేసే ప్రక్రియను పరిశీలించారు. కేంద్రంలో ఏమైనా సమస్యలున్నా యా అని నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాలతో తల్లడిల్లుతున్న రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని అవసరమైన గన్నీ సంచులు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేసిన రైస్ మిల్లులకు వెంట వెంటనే తరలిస్తూ మిల్లర్లు కూడా 24 గంటలలోగా ధాన్యం దించుకునేలా పర్యవేక్షించాలని, టాబ్ ఎంట్రీ త్వరితగతిన చేయాలని అధికారులకు సూచించారు.

తడిచిన ధాన్యమూ సేకరించాలి

రైస్ మిల్లర్లు కూడా హమాలీలలను ఎక్కువగా పెట్టుకొని లారీలు వచ్చిన 24 గంటలలోగా ధాన్యం దించుకోవాలని, ఎట్టిపరిస్థితులలో మిల్లుల వద్ద లారీలు వేచి ఉండరాదని, త్వరగా దించుకుంటేనే తిరిగి లోడింగ్ చేయడానికి అవకాశముంటుందని స్పష్టం చేశారు. అకాల వర్షాలవల్ల ధాన్యం కాస్త చెడిపోయిన రైతుల పరిస్థితులను అర్థం చేసుకొని ప్రభుత్వం ఆదేశాల మేరకు ధాన్యాల్లో ఎటువంటి కోత విధించకుండా అన్ లోడ్ చేసుకొని ట్రక్ షీట్ జారీచేయాలన్నారు. మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకోవడంలేదని అపవాదులను తావివ్వకుండా ధాన్యం వచ్చిన వెంటనే దించుకోవాలని, ప్రభుత్వ పరంగా సహకారమందిస్తామన్నారు. తహసీల్దార్‌లు, గిర్దావర్లు, సూపర్‌వైజర్ అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. టార్పాలిన్లు, గన్ని సంచులు, లారీల సమస్య తలెత్తకుండా నిరంతరం మానిటరింగ్ చేస్తున్నామని, ఈ పక్షం రోజులు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరిగేలా జిల్లా అధికారులందరూ అప్రమత్తం గా ఉండి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ప్రతి రోజు కొనుగోళ్లు ఆగకుండా,రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి సమస్య రాకుండా నిరంతరం పర్యవేక్షించవలసినదిగా ఆదేశించారు. ప్రస్తుత విపత్కర పరిస్థితులలో అధికార యంత్రాంగం యావత్తు రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తూ, వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించాలన్నారు. ఏమైనా ఇబ్బందులైతే కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కు ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

రైతులకు కష్టం కలగకుండా అకాల వర్షాలు పడుతున్నా రాత్రి పొద్దుపోయే వరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. గత యాసంగితో పోలిస్తే ఈ యాసంగి లో ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 44,182 మంది రైతుల నుండి 541 కోట్ల విలువ గల 2 లక్షల 46 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 474 కోట్లు చెల్లించామని, ట్యాబ్ ఎంట్రీ కూడా 96 శాతం మేర పూర్తి చేశామని, త్వరలో మిగతా రైతుల ఖాతాలో డబ్బులు జమచేస్తామన్నారు. కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, ఇంచార్జి జిల్లా మేనేజర్ నిత్యానందం, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు ఉన్నారు.



గంగారెడ్డిని సన్మానించిన ఐడిసిఎంఎస్ ఇన్‌చార్జి చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, పలువురు

మార్క్‌ఫెడ్ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మార గంగారెడ్డిని నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఐడిసిఎంఎస్ ఇన్‌చార్జి చైర్మన్ ఏదుళ్ళ ఇంద్రసేనారెడ్డి శాలువాతో సన్మానించారు. మార గంగారెడ్డి ప్రస్తుతం ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఎరువుల కంపెనీ అయినా ఇఫ్కో (ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కోపరేటివ్ లిమిటెడ్) కు జాతీయ డైరెక్టర్‌గా ఎన్నుకోబడిన తర్వాత గురువారం కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలంలోని బిబిపేట్ పిఏసిఎస్ సొసైటీకి మొదటిసారిగా విచ్చేసిన సందర్భంగా మర్యాదపూర్వకంగా సన్మానించారు. అనంతరం నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఐడిసిఎంఎస్ ఇంచార్జ్ చైర్మన్ గా బాధ్యతలు తీసుకున్న ఏదుల ఇంద్రసేనారెడ్డిని మార గంగారెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ఇక నుంచి ఇఫ్కో కంపెనీకి సంబంధించిన ఎరువులు రైతులందరికీ అందుబాటులో ఉంటాయని ఎరువుల కొరత ఉండదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సత్యనారాయణ, మట్ట శ్రీనివాస్, వెంకట్రావు, సొసైటీ డైరెక్టర్లు రాజమల్లయ్య, కిషన్‌రావు, నరేందర్, రాజు రెడ్డి , రైతులు, సొసైటీ సిఇఓ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎంఅండ్‌హెచ్‌వోను కోర్టులో హాజరు పరిచిన పోలీసులు

నవతెలంగాణ-కామారెడ్డి

మహిళా వైద్యులను లైంగికంగా వేధిస్తున్నట్టు ఫిర్యాదు రావడంతో విచారణ చేపట్టి డీఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం విధితమే. కాగా గురువారం ఆయనను కోర్టులో హాజరుపరిచినట్టు కామారెడ్డి డిఎస్‌పి నాగేశ్వరరావు తెలిపారు. దేవునిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏడు కేసుల నమోదు అయినట్లు తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం విచారణ జరిపి గురువారం లక్ష్మణ్‌సింగ్‌ను అరెస్టుచేసి కామారెడ్డి కోర్టులో ప్రవేశపెట్టినట్టు తెలిపారు.

ఎస్సీ కులాల విద్యార్థుల నుంచి బెస్ట్ అవైలబుల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కామారెడ్డి

2024 - 25 విద్యా సంవత్సరంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద 1 వ తరగతిలో డే స్కాలర్ ఇంగ్లిష్ మీడియ నందు, 5 వ తరగతిలో రెసిడెన్షియల్‌గా ఇంగ్లిష్ మీడియం నందు ప్రవేశం కోరం అర్హులైన ఎస్సి బాల,బాలికల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఎస్సి కులాల అభివద్ధి అధికారి రజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతిలో ప్రవేశానికి 1 జూన్, 2018 నుండి 31 మే 2019 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు. కుటుంబ వార్షికాదాయం పట్టణ ప్రాంతాలలో 2 లక్షలు, గ్రామీణ ప్రాంతాలలో లక్షన్నర ఉండాలన్నారు. దరఖాస్తు వెంట జనన, కుల ధ్రువీకరణ, రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను జతపరచాలని సూచించారు.

5వ తరగతిలో ప్రవేశానికి పై ధ్రువీకరణ పత్రాలతో పాటు 4వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్ కార్డు, బోనఫైడ్ అటెస్టెడ్ జిరాక్స్ ప్రతులను జతపరచాలని స్పష్టం చేశారు. ఆసక్తి గల బాల,బాలికలు కలెక్టరేట్ లోని తమ కార్యాలయంలో జూన్ 7 వరకు దరఖాస్తు పొంది ధ్రువపత్రాలను జూన్ 7 లోగా సమర్పించాలని, దరఖాస్తు సమయంలో ఒరిజినల్ ధ్రువపత్రాలు తప్పనిసరిగా చూపించాలని సూచించారు. జూన్ 11 న మధ్యాన్నం 2 గంటలకు జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిన ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. వివరాలకు 8328015942 నెంబరును సంప్రదించవచ్చని రజిత తెలిపారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

- దొడ్డు రకం వరి ధాన్యానికి సైతం రూ.500 బోనస్ ఇవ్వాలి
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా.. మానవహారం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకలు

నవతెలంగాణ-కామారెడ్డి

రైతులకు ధాన్యం ప్రతి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మాట మార్చి సన్నవడ్లకు మాత్రమే 500 రూపాయలు బోనస్ ఇస్తామని చెప్పడం సిగ్గుచేటని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిజాంసాగర్ చౌరస్తా వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మానవహారం తో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి రైతులను, పేదలను మోసం చేస్తూనే ఉందని ఎన్నికల్లో వడ్లకు 500 రూపాయలు బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ నేడు మాట మార్చి సన్నవడ్లకు మాత్రమే 500 ఇస్తామనడం కాంగ్రెస్ పార్టీ విశ్వరూపం బట్ట బయలు అయిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ రైతులతో కలిసి దొడ్డు వడ్లకు 500 రూపాయల బోనస్ ఇచ్చే విధంగా పోరాడుతామన్నారు. వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వారికి ప్రేమ్ కుమార్, కామారెడ్డి ఎంపీపీ ఆజనేయులు, బిబిపేట్ మండలం ఎంపీపీ బాలమణి, బిఆర్ఎస్ నాయకులు సుమిత్రానంద్, శ్రీనివాస్ గౌడ్, నల్లవెల్లి అశోక్, రేగుల సంతోష్, వడ్ల నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-రెంజల్

షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని రెంజల్ బాలుర వసతి గృహ వార్డెన్ శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో బెస్ట్ అవైలబుల్ కలిగిన పాఠశాలల్లో వారిని చేర్పించడం జరుగుతుందని తెలిపారు. ఒకటవ తరగతి విద్యార్థులకు 101 సీట్లు, నాన్ రెసిడెన్షియల్‌లో, ఐదవ తరగతి విద్యార్థులకు రెసిడెన్షియల్‌లో 102 సీట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. విద్యార్థిని విద్యార్థులు కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు, రేషన్ కార్డుల జిరాక్స్‌లపై గెజిటెడ్ సంతకం తప్పనిసరిగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గలవారు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈనెల 19 నుంచి వచ్చే నెల 7 వరకు దరఖాస్తులకు ఆహ్వానిస్తోందని ఆయన పేర్కొన్నారు.

రుద్రూరు మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-వర్ని

తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల అంబం-రుద్రూర్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు, తమ దగ్గర ఉన్న మీసేవ, ఆన్లైన్ సెంటర్లో www.telanganams.com వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపీసీ 40 సీట్లు, బైపిసి 40 సీట్లు, ఎంఇసి 40 సీట్లు, సీఈసీలో 40 సీట్లు కలవని తెలిపారు. 25-5-2024 అప్లికేషన్ కు చివరి తేదీ కావున అర్హులైన విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకోగలరని ప్రిన్సిపాల్ ఆలూరి నరేందర్ పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో డెంగ్యూ నివారణ

- వర్షాల నేపథ్యంలో పరిశుభ్రత పాటించాలి
- పీహెచ్‌సీలలో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం పురస్కరించుకొని గ్రామాల్లో అవగాహన ర్యాలీలు



ఆర్మూర్: డెంగ్యూ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆశావర్కర్లు



బాల్కొండలో...

నవతెలంగాణ-విలేకరులు

పరిసరాల పరిశుభ్రతతో డెంగ్యూను దూరం చేయొచ్చని వైద్యాధి కారులు సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పాటు రాబోయే వర్షకాలంలో పరిసరా ల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రపంచ డెంగ్యూ వ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టారు.

బోధన్ : బోధన్, సాలూర మండలాల్లోని పెగడాపల్లి, సాలూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గురువారం మెడికల్ ఆఫీసర్లు డా.రేఖ, డా.జవేరియా సుల్తానా జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సంధర్భంగా గ్రామంలో డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి 'ఎడిస్ ఈజిప్ట్' అనే దోమ కుట్టడం వల్ల వస్తుందని, ఇది గన్యాకంటే ఎక్కువగా ఒంట్లో శక్తిని హరించే వ్యాధి అని అన్నారు. సరియైన సమయంలో చికిత్స చేయించుకోనట్లయితే వ్యాధి సోకిన 50 మందిలో ప్రాణాపాయం ఉంటుందన్నారు. 'ఎడిస్ ఈజిప్ట్' అనే దోమలు పగటి పూట మాత్రమే కుడతాయని అన్నారు. దాంతో తీవ్రమైన జ్వరం, శరీరంపై దద్దుర్లు, చర్మం ద్వారా రక్తస్రావం, తీవ్రమైన తలనొప్పి



బోధన్: డెంగ్యూ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు

ఉంటుందని, కండరాల, కీళ్ళ నొప్పులు, ఆకలి మందగించడం జరగవచ్చని పేర్కొన్నారు. దీంతో ఒక్కోసారి ఒంట్లో రక్తస్రావం జరిగి ప్రాణాలకు ముప్పురావచ్చన్నారు. డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లైతే ఆరోగ్య కేంద్రానికి, ఆసుపత్రికి వెళ్లి తగిన వైద్య పరీక్షలు చేసుకుని, చికిత్స పొందాలని సూచించారు. దోమలు పుట్టకుండా చేయాలని, డెంగ్యూ వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రజలు కూడా బాధ్యత వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి చుట్టుపక్కల ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నిల్వ ఉన్న నీటిలో దోమలు తొందరగా వృద్ధి చెందుతాయని తెలిపారు. మురికి కాలువలలో ఎప్పుడు మురుగు నీరు పారేటట్లు చూసుకోవాలన్నారు. ఒకవేళ నీరు నిల్వ ఉన్నట్లైయితే కిరసనాయిల్ గాని, కాలిన ఆయిల్ గాని చల్లాలని సూచించారు. పాత టైర్లు, దబ్బాలు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ కప్పులు, పాత్రలు ఇంటి పరిసరాలలో ఉంటే, వాటిని తొలగించాలని సూచించారు. నివాస ప్రాంతాల్లో చెత్తా చెదారం లేకుండా జాగ్రత్తవహించాలన్నారు. ఇంటి కిటికీలకు, బయటి తలుపులకు దోమలు రాకుండా మెష్లు ఏర్పాటు చేసుకోవాలని, చీకటి పడకముందు తలుపులు, కిటికీలు మూసివేస్తే దోమలు ఇంటిలోకి రాకుండా నివారించవచ్చన్నారు. దోమలు కుట్టకుండా వీలైనంత వరకు, పగటి పూట పొడుగు చేతుల చొక్కా, పైజామా ధరించాలని, నిద్రించేటప్పుడు దోమ తెరలు తప్పకుండా వాడాలని సూచించారు. దోమల వలన డెంగ్యూ, చికెన్ గన్యా వ్యాధి రాకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ఎవరికైనా జ్వరం ఉందేమో కనుక్కొని దాని వ్యాధి లక్షణాలు తెలుసుకొని వెంటనే దగ్గర్లోని ఆరోగ్య కేంద్రానికి గాని, ఆసుపత్రికి గాని పంపించే ఏర్పాటు చేయాలన్నారు. సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమాచారం పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, స్టాఫ్ నర్సులు, ఫహీమ్, శాంతకుమారి, రోజా, సంధ్య, సూపర్ వైజర్లు ఇందిర, సునీత, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : మండలంలోని గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆరోగ్య శాఖ సిబ్బంది జాతీయ డెంగ్యూ దినోత్సవ ర్యాలీని మామిడిపల్లి వీధులలో నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ మానస మాట్లాడుతూ రాబోయేది వర్షాకాలం కావున ఇప్పటినుండే ప్రజలకు డెంగ్యూ వ్యాధి వ్యాప్తి చెందే విధానం, దోమల వృద్ధి నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో బస్తీ దవాఖాన వైద్యాధికారి డాక్టర్ ప్రీతి పావని, పెర్కిట్ ఎంఎల్హెచ్పి డాక్టర్ యాస్మిన్ హెచ్ఈఓ రవి పాల్గొన్నారు.

ధర్పల్లి : మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో డెంగ్యూ దినోత్సవం సందర్భంగా గ్రామపంచాయతీ సెక్రటరీలకు హెల్త్ సూపర్వైజర్స్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ సుశాంత్ రెడ్డి, ఎంపీడీవో బాలకృష్ణ పాల్గొని వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్. సుశాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎడిస్ దోమ కాటు వల్ల డెంగ్యూ వ్యాధి వ్యాపించే ప్రమాదం ఉందని. కొన్ని సందర్భాల్లో ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని అన్నారు. దోమలు నీటి నిల్వల యందు ఎక్కువగా పెరుగుతాయి, ఎడిస్ దోమలు పగటిపూట కుడతాయి, ఇవి చీకటి మరియు చల్లటి ప్రదేశంలో ఎక్కువగా నిల్వ ఉంటాయని అన్నారు. వారం కంటే నీటి నిలువ ఎక్కువ రోజులు ఉంటే దోమలు తయారవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణ, హెల్త్ సూపర్వైజర్ లు రాజేందర్, నిర్మల, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

రెంజల్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగ్యూ నివారణలో భాగంగా వైద్య సిబ్బందిచే అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు డాక్టర్ వినయ్ కుమార్ పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు వైద్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించా మన్నారు. దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దోమతెరలు వాడాలని, పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకోవాలని ఈ ర్యాలీలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సహస్ర పీర్దోష్, మలేరియా నోడల్ అధికారి కరిపే రవీందర్, ఆరోగ్య సూపర్వైజర్ మాలంటి, ఆరోగ్య విస్తీర్ణ అధికారి శ్రావణ్ కుమార్, ఫార్మసిస్ట్ రామచందర్ ఉన్నారు.

బాల్కొండ : మండల పరిధిలోని కిసాన్‌నగర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారులు మాట్లాడుతూ.. ప్రజలు తమ పరిసర ప్రాంతాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలలో నీరు నిలువ ఉండకుండా, దోమలు వద్ధి చెందకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రజలు అనారోగ్యానికి గురైనప్పుడు సరైన చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ యశ్వంత్, హెల్త్ సూపర్‌వైజర్ చిలుక వాణి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవీపేట్ : డెంగ్యూ దినోత్సవం సందర్భంగా నవీపేట్ సిహెచ్‌సి, బినోల పిహెచ్‌సిలలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం బినోల పిహెచ్‌సిలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డెంగ్యూ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. డెంగ్యూ సోకిన వారికి అందించాల్సిన చికిత్స గురించి తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారిని కావ్య డాక్టర్ ప్రేమలత, వెంకటేశ్వర్‌రావ్, సూపర్వైజర్ కిషన్, పుష్ప, ఏఎన్ఎంలు,. ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన...

జక్రాన్‌పల్లి : డెంగ్యూపై అవగాహన కల్పించడం వల్ల పెద్ద నష్టాన్ని అరికట్టవచ్చని మండల వైద్యాధికారి రవీందర్ అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని జక్రాన్‌పల్లి పిహెచ్‌సిలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రవీందర్ మాట్లాడుతూ.. డెంగ్యూ అనేది ఒక అంటూ వ్యాధి, త్వరగా వ్యాపిస్తుందని, త్వరగా మన శరీరంలోని అన్ని అవయవాలను ప్రభావితం చేస్తుందని అన్నారు. కాబట్టి ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని, డెంగ్యూ వ్యాధి అవగాహనతో డెంగ్యూ నివారించవచ్చని తెలిపారు. అనంతరం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, ఏఎన్ఎం, సూపర్‌వైజర్, మెడికల్ ఆఫీసర్ పాల్గొన్నారు.

డెంగ్యూను అరికడదాం..

భీంగల్ : డెంగ్యూని అరికట్టి ప్రాణాలను కాపాడుకుందామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అజయ్‌పవర్ అన్నారు. ప్రపంచ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ కేంద్రంలో ఆరోగ్య సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ఆ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది భూలక్ష్మి సూపర్ వైజర్, మారుతి ఆర్‌పి, లక్ష్మీనారాయణ లాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎంలు , ఆశాలు పాల్గొన్నారు

మాక్లూర్ : మండల కేంద్రంలో ప్రాథమిక ఆసుపత్రి అధ్వర్యంలో డెంగ్యూ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు రాకుండా తగు జాగ్రత్తలను చేపట్టాలని గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటేష్, సిహెచ్ఓ ఆనంద్ కుమార్, సూపర్ వైజర్ సుధాకర్ పాల్గొన్నారు.

మెండోర : మెండోర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగ్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రణవ మాట్లాడుతూ దోమల

నుండి వచ్చే వ్యాధులను నివారించడానికి చర్యలు చేపట్టి డెంగ్యూ వ్యాధి రాకుండా జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని నిర్వహించుకుంటామని అన్నారు. ప్రజలు వ్యాధి బారిన పడకుండా కాపాడుకునే భాధ్యత మనపై ఉందని ఆరోగ్య శాఖ సిబ్బందికి గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజ్ కుమార్, పోలీస్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల : మెడికల్ ఆఫీసర్ ప్రసన్న ప్రియ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ వ్యాధిగురించి, దోమలు ఎలా వ్యాప్తి చెందుతాయో ప్రజలకు తెలుపుతూ వాటి నివారణ మార్గాలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ మారుతి, హెల్త్ అసిస్టెంట్ పండరీ, ఏఎన్ఎం లు,ఆశాలు పాల్గొన్నారు.

కోటగిరి : మండల కేంద్రంలో డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ వైద్య ఆరోగ్యశాఖ సూపర్వైజర్ జ్యోతి ఆధర్వంలో నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల పట్ల జాగ్రత్తగా ఉండాలని నీటిని నిల్వ ఉంచకుండా చూడాలని, దోమ తెరలు వాడాలని తెలిపారు.

డిచ్‌పల్లి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్వాయి నందు మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి తీవ్రమైన తలనొప్పి, చలి జ్వరంతో కూడిన అలసట ఉంటే దానిని డెంగీ వ్యాధిగా చెప్పవచ్చని పేర్కొన్నారు. డెంగ్యూ వ్యాధిని ఎలిసా పరీక్ష ద్వారా నిర్ధారణ చేస్తారని ఆయన అన్నారు ప్రజలందరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ అనిత ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భీంగల్ రూరల్ : భీంగల్ పిహెచ్‌సీ సెంటర్లో వైద్య అధికారి అజయ్ పవర్ ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో సూపర్వైజర్ భూలక్ష్మి, ఆర్పి మారుతి, ల్యాబ్ టెక్నీషియన్ లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

లింగంపేట్ : మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి హిమబిందు మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ వ్యాధి వ్యాపించే అవకాశం ఉందని అందుకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. వర్షాకాలంలో ప్రతి ఒక్కరు పరిశుభ్రతతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలి ఆమె సూచించారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం అవగాహన కల్పించారు ప్రతి ఒక్కరూ వ్యాధి నివారణ కోసం జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు ఈ ర్యాలీలో వైద్య సిబ్బంది ప్రదీప్ యాదగిరి రమేష్ ఏఎన్ ఎంలు ఆశ వర్కర్లు ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆశావర్కర్లు



ధర్పల్లిలో...



జక్రాన్‌పల్లిలో...



భీంగల్‌రూరల్...



కోటగిరిలో...



మాక్లూర్‌లో...



మెండోరలో...



నవీపేట్‌లో...



రెంజల్‌లో...

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
శుక్రవారం | మే 17, 2024 | www.navatelangana.com

ధాన్యం వేగంగా కొనుగోలుకు ఆదేశించాం

- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ధాన్యం వేగంగా కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశామని, రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని రైతుల దగ్గర నుండి చివరి గింజ వరకు వరి ధాన్యం కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత వారం రోజుల నుండి వాతావరణంలో మార్పు రావడంతో గాలి వాన బిభత్సం సష్టించడంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, అలాగే దళారుల జోక్యం లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని చెప్పినట్టు పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చూడండి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



మట్లాడుతున్న ఇచ్చార్జి ఎంపివో

గ్రామాలలో తాగునీటి ఎద్దడి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఇన్చార్జి ఎంపివో ప్రకాష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాలలో తాగునీటి ఎత్తడి రాకుండా చూడాలన్నారు అదేవిధంగా ఉపాధి హామీ పనులలో ఎక్కువ కూలీలు పనిచేసే విధంగా ప్రాణాళికలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన అన్నారు కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

ఎవరి ధీమా వారిదే..

- సర్వేలతో తికమక పడుతున్న నేతలు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో హెరాహెరీగా సాగిన ముక్కోణపు పోటీలో విజయం తమదే అంటే తమదే అంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ధీమాను వ్యక్తం చేస్తున్నాయి. సిట్టింగ్ స్థానాన్ని మళ్లీ నిలబెట్టుకుంటున్నామని లక్షకు తగ్గకుండా మెజార్టీని ప్రజలు తమకిస్తున్నారని బీఆర్ఎస్ చెబుతుంది. వివిధ సోషల్ మీడియా సర్వేలతో పార్లమెంట్ ఎన్నిక ఫలితాలపై నాయకులు కార్యకర్తలు తికమఖపడుతూ ఆందోళనలకు గురవుతున్నారు. కొందరు పందాలు కాస్తుండగా మరికొందరు విహార యాత్రలకు తరలి వెళ్లారు. ప్రజలు తమ ప్రభుత్వంపై సానుకూలత వ్యక్తం చేస్తూ ఓట్లు వేయడంతో విజయాన్ని సాధిస్తున్నామని కాంగ్రెస్ ప్రకటించింది. నియోజకవర్గంలో సైలెంట్ ఓటర్లు వేసిన ఓట్లతో ఘన విజయం సాధిస్తున్నామని బిజేపీ విశ్వాసంతో ఉన్నది. గత కొన్ని సంవత్సరాలుగా బాన్సువాడ నియోజకవర్గం ఓటర్లు పార్లమెంట్ ఎన్నికల్లో కీలకంగా మారుతున్నారు. గత 2019 ఎంపీ ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీకి మెజార్టీ రాకపోవడం, బాన్సువాడ నియోజకవర్గంలో ఆ పార్టీకి అధిక మెజార్టీ రావడంతో ఆనాడు బీఆర్ఎస్ అభ్యర్థి బీబీ పాటిల్ తక్కువ మెజార్టీతో గెలుపొందారు. 2014లో కూడా బాన్సువాడ నియోజకవర్గం ఓటర్లే బీఆర్ఎస్ పార్టీకి గెలుపునకు కీలకంగా మారారు. ఈ సంవత్సరం కూడా జాహిరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గం ఓటర్లు



కీలకంగా మారనున్నట్టు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆశ భావం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో తమతమ నాయకులు, పోలింగ్ ఏజెంట్ల నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషించుకున్న తర్వాత అన్ని పార్టీలు తమదే విజయమంటూ ధీమాను వ్యక్తం చేస్తున్నాయి.

తమదే విజయం అంటున్న కమలనాథులు

రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు నరేంద్ర మోదీని తిరిగి ప్రధానిగా చూడాలని కోరుకుంటున్నారని మేరకు అంతటా మోదీ పవనాలు వీచి తమకు ఘన విజయాన్ని చేకూర్చి పెడుతున్నాయని బీజేపీ నేతలు అంటున్నారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటు చేయాలని ఎంఐఎం పిలుపునివ్వడం, హిందూ వర్గాల్లో ఓటింగ్ సరళిని మార్చి తమకు అనుకూలంగా ఓట్లు పడ్డాయని బీజేపీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ అనుకూలవాతావరణం ఉన్న నేపథ్యంలో బీబీ పాటిల్ ఈ నియోజకవర్గంలో లక్షను మించిన మెజార్టీతో గెలుపొందుతారని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు.

సంక్షేమ పథకాలు గెలిపిస్తాయంటున్న కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ మాత్రం గెలుపుపై సంపూర్ణ విశ్వాసంతో ఉందని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. ముస్లిం మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ, దళితవర్గాల ఓట్లు తమకు ఏకపక్షంగా పోలయ్యాయంటున్నారు. ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివద్ధి, సంక్షేమ పథకాలపై కూడా మహిళలు, ప్రజలు సంతప్తిని వ్యక్తం చేస్తూ ఓట్లు వేయడం తమకు కలిసి వచ్చే అంశమని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

సైలెంట్ ఓటింగ్ జరిగిందటున్న బీఆర్ఎస్

గెలుపుపై ధీమాను వ్యక్తంచేస్తున్నా బీఆర్ఎస్ నేతలు పెద్దగా హడావుడి చేయడం లేదు. సైలెంట్ ఓటర్లు అందరూ బీఆర్ఎస్ వెంటే ఉన్నారని, బీజేపీలో మోదీని చూసిన విధంగానే బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ ను పరిగణలోకి తీసుకొని ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఓటు వేయడం తమకు కలిసి రానున్నదని ఆ పార్టీ నేతలు అంటున్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఒక్కరు బీజేపీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహించడం ఆయా పార్టీలకు కలిసివచ్చే అంశంగా చెబుతున్నారు. ఎవరి కలలు నిజమవుతాయన్నది మరో 20 రోజుల తర్వాత జరిగే ఓట్ల లెక్కింపుతో తేటతెల్లం కానున్నది.

కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి

- ఎంపీడిఓ గోపాలకష్ణ



మాట్లాడుతున్న ఎంపీడిఓ గోపాలకృష్ణ

నవతెలంగాణ-బిచ్కుంద

గ్రామ కార్యదర్శులు గామాల్లో తాగునీటి సరఫరా విషయంలో ఇబ్బందులు రానీయకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడిఓ గోపాలకష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా జరుగుతున్న పనులకు హాజరవుతున్న కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాలని గ్రామాల్లో నూతన నీటి ట్యాంకు నిర్మాణం కోసం స్థలాలు గుర్తించి రిపోర్టు తయారుచేసి ఇవ్వాలన్నారు. గ్రామ కార్యదర్శులు స్థానికంగా ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా ముఖ్యంగా త్రాగునీటి విషయంలో సింగల్ ఫేస్ మోటర్ల ద్వారా ట్యాంకులు కలెక్షన్ ఇచ్చి నీరు వథా కాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మహబూబ్, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈ రోడ్డును బాగుచేసేదెవరో..?



పూర్తిగా కంకర తేలిన రోడ్డు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలం లోని పద్మాజివాడి నుండి తుక్కోజివాడి లింక్ రోడ్డున ఎవరు బాగు చేస్తారని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఈరోడ్డు గూండా వెళ్లేందుకు జంకుతున్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారినా రోడ్డు పరిస్థితి మారడం లేదని, గుంతలమయంగా ఉన్న రోడ్డుపై ప్రయాణం.. ప్రాణసంకటంగా మారినటుట్ట వాపోతున్నారు.భారీ వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయి గుంతలమయంగా మారింది. ఈ లింక్ రోడ్డు గుండా తుక్కోజివాడి, పద్మాజివాడి, భూంపల్లి, తిమ్మోజివాడి రైతులు వస్తు పోతుంటారు. రైతుల, వాహనదారుల సమస్యలు పట్టించుకునే వారు కరువైనట్టు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సబ్‌సెంటర్‌ను సందర్శించిన టీం



సబ్‌సెంటర్‌ను సందర్శించిన సభ్యులు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, రామేశ్వర్ పల్లి గ్రామంలో ఉన్న సబ్ సెంటర్ అనిమియా ముక్త్ భారత్ మానిటరింగ్ టీం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వైద్యులు సిమ్రాన్, స్టేట్ గవర్నమెంట్ చైల్డ్ సర్వైవల్ కన్సల్టెంట్ యూనిసెఫ్ రవి నాయుడు, న్యూట్రిషన్ కన్సల్టెంట్ డాక్టర్ సౌజన్య గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశాలను, గర్భిణీ స్త్రీలను , బాలింతలను, కిశోర బాలికల ఐరన్ టాబ్లెట్ తీసుకునే విధానం గురించి రక్తహీనత నివారణకు చేపడుతున్న వివరాలు ఆరా తీసి రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యేమీమ, డాక్టర్ ఆదర్శ్, డాక్టర్ మనోజ్, సూపర్వైజర్ దీవెన, హెచ్ ఇ ఓ వెంకటరమణ, ఏఎన్ఎంలు మాధవి, యాదమ్మ ,మంజుల, ఆశాలు సంగీత,కీర్తి, రేణుక పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మధు శ్రీవాత్సవ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపిసి, సీఈసీ, ఎం ఇ సి గ్రూపులో ఇంగ్లీష్, తెలుగు మాధ్యమంలో దరఖాస్తు చేసుకునేవారు, పదవ తరగతి ఉత్తీర్ణత పత్రము, పాస్ పోర్ట్ సైజు ఫోటో లతో కళాశాలలో సంప్రదించి అడ్మిషన్ పొందాలని సూచించారు.

ఏఐసిసి సభ్యురాలిని కలిసిన నాయకులు

నవతెలంగాణ-సదాశివనగర్

ఏఐసీసీ సభ్యురాలు గిరిజను కాంగ్రెస్ నాయకులు బంటు భూమేశ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేసినట్టు తెలిపారు. ప్రస్తుతం జహీరాబాద్ పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసిన సురేష్ షెట్కార్ కూతురని తెలిపారు.

కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్విహించాలి



మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధక్షులు నీల నాగరాజ్

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్రంలో కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్విహించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కులగణన ప్రక్రియ చేపట్టిన తర్వాత బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కులగణన జరిపి బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచుతామని ఇప్పటికే హామీ ఇచ్చారని అన్నారు.లోక్ సభ ఎన్నికలు ముగిశాక జూన్ చివరి వారంలో స్థానిక సంస్థల ఎన్నికలని నిర్వహిస్తామని సీఎం ప్రకటించిన నేపథ్యంలో కులగణన చేపట్టి,రిజర్వేషన్లు పెంచిన తర్వాత మాత్రమే ఎన్నికలు నిర్వహించాలని లేని పక్షంలో బీసీలమంతా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు.

డిఎంహెచ్‌ఓను కఠినంగా శిక్షించాలి

- కామారెడ్డి మహిళా వేదిక, సిటిజన్స్ అసోసియేషన్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి డీఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌ను కఠినంగా శిక్షించాలని కామారెడ్డి మహిళా వేదిక, సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంస్థలో పనిచేస్తున్న మహిళా వైద్యాధికారులు, ఇతర మహిళా ఉద్యోగులు తన చాంబర్ కు వచ్చినప్పుడు, తరచుగా వారిని విభిన్న రీతుల్లో లైంగిక వేధింపులకు గురి చేయడం హేయనీయమని, ఇటీవల చాలాకాలంగా సదరు అధికారి, మహిళా వైద్యాధికారులు, కార్యాలయ పనికొరకై, తన ఛాంబర్ లోకి వచ్చినప్పుడు సంబంధిత దస్త్రాలను అందించేటప్పుడు వారి చేతుల్ని తాకడం, వ్యక్తిగత వివరాల్లోకి వెళ్లడం, తరచుగా ఫోన్లుచేయడం ఉపేక్షించరానిదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి మహిళా వేదిక, సిటిజన్స్ అసోసియేషన్ మరియు అధ్యయనవేదికల ప్రతినిధులు ,కె. నలినీ దేవి, బి. సుధ, జి. జగన్నాథం, కె. వేణుగోపాల్, కె. శ్రీనివాస్, కె. రమణ, పి. అంజయ్య తమ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

హైకోర్టు తీర్పు పట్ల సిక్లీకర్ కులస్తుల హర్షం

నవతెలంగాణ-నవీపేట్



మాట్లాడుతున్న కులస్తులు

మండల కేంద్రంలోని సంత ప్రాంగణంలో గత 75 సంవత్సరా లుగా జీవనం సాగిస్తున్న సిక్లికర్ కులస్తుల ఇంటి స్థలాల విషయమై హైకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల కుల పెద్దలు గురుద్వార్ కమిటీ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. సంత ప్రాంగణంలో నివసిస్తున్న నాలుగు కుటుంబాలను తొలగించాలని గ్రామపంచాయతీ ప్రయత్నించగా నిజామాబాద్ జిల్లా కోర్టును ఆశ్రయించి ఇంజక్షన్ ఆర్డర్ ను పొందారు. అనంతరం కుల పెద్దలు, గురుద్వార్ కమిటీ పెద్దల సహకారంతో హైకోర్టు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా వారికి అనుకూలంగా తీర్పు ఇవ్వడం పట్ల కుల పెద్దలు గురువారం విలేకరుల సమావేశంలో హర్షం వ్యక్తం చేశారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే సైతం ఆ కుటుంబాల ఇంటి నిర్మాణానికి సంక్షేమ పథకాల అందించేందుకు కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుల రాష్ట్ర నాయకులు మన్ జీత్ సింగ్, గురుద్వార్ పెద్దలు అజిత్ సింగ్ బోధన్ గురుద్వారా, అజిత్ సింగ్ అమీర్ పేట్ గురుద్వారా పెద్దలు స్థానికులు పాల్గొన్నారు.

ధాన్యం నిల్వఉండనీయొద్దు

- అకాల వర్షాల నేపథ్యంలో ఎప్పటికప్పుడు తరలించాలి
- అదనపు కలెక్టర్ చంద్ర మోహన్

నవతెలంగాణ-కామారెడ్డి

అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం నిల్వలు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని జెసి చాంబర్లులో గురువారం రెవెన్యూ, జిల్లా పౌర సరఫరాల అధికారులతో ధాన్యం కొనుగోల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే మూడు రోజులు వర్షాలు కురిసే సూచనలున్నందున ధాన్యం రాశులను త్వరగా తూకం వేసి మిల్లులకు తరలించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు అవసరమైన టార్పాలిన్లు అందించాలని, మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులు తమ ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పి ఎగిరిపోకుండా చూసుకోవాలని కోరారు. రైతులు అధైర్యపడవద్దని, తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసి అధికారులు బాయిల్డ్ మిల్లులకు తరలించే విధంగా చూడాలన్నారు. తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టి తేమ శాతం తగ్గేలా చూడాలన్నారు. లారీలలో ధాన్యాన్ని వెంటనే అన్ లోడ్ చేసుకోవాలని, ట్రక్ షీట్ జారీచేయాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా మిల్లులకు వచ్చిన లారీలను 24 గంటల లోగా అన్ లోడ్ చేసుకొని త్రిప్పి పంపితే తిరిగి కొనుగోలు కేంద్రాలలో ధాన్యం లోడింగ్ చేసి పంపడానికి అవకాశముంటుందని అన్నారు. ఈ రబీ సీజన్‌లో ఇప్పటి వరకు 42,142 మంది రైతుల నుంచి 526 కోట్ల విలువ గల 2,38,488 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి ట్యాబ్ ఎంట్రీ త్వరితగతిన చేస్తూ 84 శాతం మేర 441 కోట్లు రైతుల ఖాతాలో జమచేశామని చేశామని, మిగతా డబ్బులు రైతుల ఖాతాలో త్వరలో జమచేస్తామని చంద్ర మోహన్ తెలిపారు. వడ్ల కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేస్తూ త్వరగా డబ్బులు ఖాతాలో జమ చేసే విధంగా చూడాలని జెసి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున బాబు, ఇన్చార్జి జిల్లా పౌరసరఫరాల మేనేజర్ నిత్యానందం, ఉప తహసీల్దార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్ర మోహన్

ఫిర్యాదు స్వీకరించని ఎస్ఐపై మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు

నవతెలంగాణ-కామారెడ్డి

ఫిర్యాదు చేస్తే స్వీకరించని ఎస్ఐపై.. బాధితులు మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. వివరాల్లోకివెళ్తే.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలానికి చెందిన కర్రోళ్ల అమత మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్‌పై మానవ హక్కుల సంఘానికి తనకు కానిస్టేబుల్ సతీష్ గౌడ్ వల్ల అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని మాచారెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే ఫిర్యాదు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తన ఫిర్యాదును తీసుకొని పక్కన పెట్టాడని దీంతో మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు కర్రల అమత తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామానికి చెందిన కర్రోళ్ల అమత జనవరి 16, 2024న మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన ఇందూరి రామస్వామి గౌడ్, ఇందూరి సతీష్ గౌడ్,(పోలీస్ కానిస్టేబుల్) ఇందూరు భాగ్యమ్మలు మా ఇంటి లోకి అక్రమంగా చొరబడి తనను అసభ్య పదజాలంతో దూషించి, కర్రతో కొట్టి చంపేస్తామని బెదిరించారాని, తాము వెంటనే 100 కు ఫోన్ చేయగా పోలీసులు వచ్చి వాళ్లను తీసుకెళ్లారని తెలిపారు. అదే రోజు సాయంత్రం ఐదు గంటల కు మాచారెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానన్నారు. మాచారెడ్డి ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తన ఫిర్యాదును ఎంట్రీ చేయలేదని ఆన్‌లైన్ రసీదు ఇవ్వలేదని ఆరోపించారు. తనపై దాడి చేసిన వారిపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని ఇట్టి విషయాన్ని మాచారెడ్డి ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ ని అడగగా పొంతన లేని సమాధానం చెబుతూ వచ్చాడని తనను కొట్టిన వ్యక్తుల్లో సతీష్ పోలీస్ కావడం వల్లనే ఎస్ఐ అతనికి సహాయం చేస్తున్నట్టు ఆరోపించారు. తన ప్రాథమిక హక్కు అయిన ఆర్టికల్ 14ను ఉల్లంగించిన మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్‌పై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్టు బాధితురాలు తెలిపారు

ఇక స్థానిక పోరు

- సర్పంచ్ ఎన్నికల్లో పట్టుకు స్థానిక నేతల చూపు

నవతెలంగాణ-మద్నూర్



రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ఘట్టం ముగియగానే స్థానిక నేతలు స్థానిక ఎన్నికలపై దృష్టిసారించారు. గ్రామాల్లో పట్టుకోసం ప్రయత్నాలు చేపడుతున్నారు. పార్టీలు సైతం స్థానికంగా తమ బలం పెంచుకునేందుకు సర్పంచ్ ఎన్నికలు కీలకం కాగా.. ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఆయా పార్టీల నుంచి పోటీ చేసేందుకు ఒక్కొక్క పార్టీలో ముగ్గురు నుంచి నలుగురు పేర్లు వినబడుతున్నాయి. మద్నూర్ మండల కేంద్రం మేజర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ ఎన్నికకు పోటీ చేయడానికి కాంగ్రెస్ పార్టీ బిజెపి పార్టీ లలో తీవ్ర పోటీ కనిపిస్తుంది. ఒక్కొక్క పార్టీలో ఇద్దరూ ముగ్గురు నలుగురు ఐదుగురు పేర్లు ముందుకు వినిపిస్తున్నాయి. వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ బిజెపి పార్టీలలో వర్గ పోరు అధికంగా కనిపిస్తోంది. నేనంటే నేనే సర్పంచ్ గా పోటీ చేస్తానంటూ ఇరు పార్టీల లో సర్పంచ్ ఎన్నిక కోసం పోటీ తీవ్రంగా కనిపిస్తుంది. ఆయా పార్టీల ఐకమండ్ ఎవరి పేరు ప్రతిపాదిస్తుందో కానీ సర్పంచ్ ఎన్నిక కోసం మద్నూర్ మండల కేంద్రంలో గత రెండు రోజుల నుండి కాంగ్రెస్ బిజెపి పార్టీల కు చెందిన వారు తమ పేర్లను బయటకు చెప్పుకుంటున్నారు. పార్టీ హై కమాండ్ తనను కాదంటూ మరొకరి పేరు తీసుకువస్తే రెబల్‌గా పోటీ చేసేందుకు కాంగ్రెస్ బిజెపి పార్టీలలో వర్గ పోరు మొదలైనట్లు తెలుస్తోంది. గెలుపు ఓటమిలపై ఆయా పార్టీల నాయకులే వ్యతిరేకంగా పోటీపడే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో సర్పంచ్ల ఎన్నికలు జూన్ మాసంలో జరిగే అవకాశాలు కనిపిస్తున్న తరుణంలో సర్పంచ్ ఎన్నికలపై నాయకుల హడావుడి మొదలైంది. కాంగ్రెస్, బిజెపి పార్టీల మధ్య తీవ్ర పోటీ కనిపిస్తుంది.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
4
శుక్రవారం | మే 17 2024 | www.navatelangana.com

రోడ్డు వేశారు.. కల్వర్టులు మరిచారు



నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రం నుంచి బోధన్ ఇతర గ్రామాలకు వెళ్లే ముఖ్య రహదారిలో ఉన్న కల్వర్టులు కట్టక పోవడం వలన, నిత్యం వేల సంఖ్యలో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. చెరువు గట్టుపై ఉన్న కల్వర్టు దగ్గర ట్రాక్టర్ బోల్తా పడగా బోధన్ వెళ్లే రహదారిపై బీర్కూర్ కార్నర్‌లో కొద్దిరోజుల క్రితం ఒక కారు బోల్తా పడింది. అయినప్పటికైనా చర్యలు తీసుకోని, కల్వర్టుల నిర్మాణాలు చేపట్టి, ప్రమాదాలు నివారించాలని కోరుతున్నాను.

బండారుపల్లిలో అఖండ శివనామ సప్తహ



నవతెలంగాణ -బోధన్

బోధన్ మండలం బండారుపల్లిలో గ్రామంలో గురువారం అఖండ శివనామ సప్తహ భక్తి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ మేరకు చినమావందికి చెందిన ప్రముఖ అధ్యాత్మికవేత్త రాచప్ప మాట్లాడారు. లింగాయత్ సమాజ్ ఉద్భవించిన తీరును వివరించారు. సప్తహ ఈనెల 23 వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో హనుమాన్ మందిరం పూజారి శంకరప్ప, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నాగనాథ్ పటేల్, బీఆర్ఎస్ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు గణేష్ పటేల్, గ్రామ పెద్దలు గోవిందరావు, మారుతి పటేల్, పండిత్ పటేల్, విట్టల్ పటేల్ తోపాటు మహిళలు భక్తులు పాల్గొన్నారు.

దొడ్డు వడ్లకూ బోనస్ చెల్లించాలి

- బీఆర్ఎస్ నాయకుల ధర్నా, రాస్తారోకో

నవతెలంగాణ-విలేకరులు

నిజామాబాద్ సిటీ : రైతులు పండించిన దొడ్డు రకం వరి ధాన్యానికి సైతం బోనస్ చెల్లించాలని మేయర్ దండు నీతు కిరణ్ అన్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పిలుపు మేరకు రైతులకు 500రూపాయల బోనస్ ప్రకటించాలని ధర్నా చౌక్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలప్పుడు ఒక మాట ఎన్నికలు అయిపోయిన తరువాత ఒక మాట మాట్లాడుతూ.. రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని అధికారంలోకి వచ్చి మళ్లీ 100రోజుల నాటకం ఆడారని, అది ముగిసిన తరువాత ఆగష్టు 15లోపు రుణమాఫీ చేస్తానని ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్నారని అన్నారు. సన్నం వడ్లకు మాత్రమే 500 బోనస్ ఇస్తామని మాట మార్చటం సిగ్గు చేటని అన్నారు. ప్రతి రైతుకు బేషరతుగా 500రూపాయల బోనస్ ప్రకటించాలని లేకుంటే రైతులతో కలిసి పోరాటం చేసి ఈ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు వదిలిపెట్టమని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పి చైర్మెన్ దదన్నగారి విఠల్ రావ్ గారు, పార్టీ నగర అధ్యక్షులు సిర్ప రాజు, మాజీ నుడా చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, బిసి సెల్ ప్రెసిడెంట్ గాండ్ల లింగం, యస్సి సెల్ అధ్యక్షులు నీలగిరి రాజు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



బాల్కొండ: ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాల్కొండ: వరి ధాన్యానికి బోనస్ చెల్లించాలని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన నిర్వహించారు. మాజీ మంత్రి బాల్కొండ శాసనసభ్యులు ప్రశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు రోడ్లపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ బాల్కొండ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, ముప్కాల్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, నాయకులు సామ వెంకట్ రెడ్డి, వై.లింగాగౌడ్, సొసైటీ చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, రైతు బందు సమితి జిల్లా, మండల గ్రామ కోఆర్డినేటర్‌లు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, తాజా మాజీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : పట్టణంలోని కెనాల్ కట్ట వద్ద బీఆర్ఎస్ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్ మాట్లాడుతూ.. వరి ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తానని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తానని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి వంచించి, మోసం చేశారని రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. వెంటనే తడిసిన ధాన్యంను కొనుగోలు చేయాలని, అలాగే ప్రకటించిన బోనస్‌ను అన్ని రకాల ధాన్యానికి ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కూరపాటి అరుణజ్యోతి, సీనియర్ నాయకులు సుంకర రవి, సొసైటీ వైస్ చైర్మన్ నర్మల్ నవీన్, యువజన కమిటీ అధ్యక్షులు గుంజేటి పృథ్వీరాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు జన్నెపల్లి రంజిత్, మండల యువజన కమిటీ అధ్యక్షులు అగ్గు క్రాంతి, ఆలూరు మాజీ ఉపసర్పంచ్ ధర్మాజీ శ్రీను, మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్, యువజన నాయకులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో...



నిజామాబాద్ సిటీలో...

18 నుంచి కబడ్డీ సమ్మర్ క్యాంప్ ప్రారంభం

- 50 మంది క్రీడాకారుల ఎంపిక



కబడ్డీకి ఎంపికైన క్రీడాకారులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ గ్రామీణ క్రీడా ప్రాంగణం 'చైతన్య నెహ్రూ యువజన సంఘం' క్రీడా మైదానంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 'అండర్-16, అండర్-20 బాలురకు గురువారం సెలక్షన్స్ నిర్వహించినట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు అంద్యాల లింగయ్య, కె.గంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. ఇందులో 100కు పైగా క్రీడాకారులు పాల్గొనగా 50 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 18 నుండి జూన్ 1 వరకు కబడ్డీ శిక్షణ తరగతులు 'సమ్మర్ స్పెషల్ క్యాంపు' నిర్వహించడం జరుగుతుందన్నారు. శిక్షణ కాలంలో క్రీడాకారులకు భోజన వసతి, అకామిడేషన్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో పీడీలు రాజ్ కుమార్, మల్లేష్ గౌడ్, పీఈటీలు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, యువజన సంఘం నాయకులు, కబడ్డీ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిపనులు, తాగునీటిపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కార్యాలయంలో ఎంపిడిఓ బాలకృష్ణ గురువారం పంచాయతి కార్యదర్శులతో, ఈజీఎస్ సిబ్బందితో వారాంతపు సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా అయన కూలీల పెంపుదల, నర్సరీల్లో మొక్కల పెంపకం, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, వేసవి కాలం ఉన్నందున తాగునీరు మొదలగు వాటిపై సమీక్షించారు. ఇప్పటివరకు జరిగిన పనులపై కార్యదర్శులకు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను అడిగి తెలుసు కున్నారు. పనులు జరిగే చోట కూలీలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రంలో అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

యాప్‌లతో మోసపోవద్దు : ఎస్ఐ

- గ్రామస్తులకు అవగాహన



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో గ్రామస్తులకు పోలీసులు "కమ్యూనిటీ ప్రోగ్రామ్" గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ భాస్కరా చారి సీసీ కెమెరాల నిఘా, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సీసీ కెమెరాలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మవద్దని సూచించారు. డబ్బులు ఇస్తామంటూ వస్తున్న లోన్ యాప్ లను డౌన్లోడ్ చేసుకొని యువత మోసపోవద్దని అన్నారు. సైబర్ నేరాల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, యువజన సంఘం నాయకులు, ఏఎస్సై సురేష్, పోలీసు సిబ్బంది సాగర్, సురేష్, నిర్మల తదితరులు పాల్గొన్నారు..

బుద్దె రాజేశ్వర్ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ -బోధన్



నివాళ్లు అర్పిస్తున్న పలువురు

సాలూర మండల కేంద్రానికి చెందిన బోధన్ ఎంపిపి బుద్దె సావిత్రి భర్త, సీనియర్ నాయకుడు బుద్దె రాజేశ్వర్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందగా రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అబ్బగోని లక్ష్మి నర్సయ్య గౌడ్ గురువారం పరామర్శించారు. రాజేశ్వర్ చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మి నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ రాజేశ్వర్ నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకున్న మంచి నాయకుడన్నారు. తుది శ్వాస వరకు ప్రజా సేవలో గ్రామ అభివృద్ధికి పాటుపడ్డారని పేర్కొన్నారు. రాజేశ్వర్ మరణం ఆయన కుటుంబానికే గాక గ్రామానికి తీరని లోటని తెలిపారు. ఆయన వెంట సలీం బేగ్, ఫతేపూర్ మాజీ సర్పంచ్ అమీర్, బొర్ర గంగారాం ,కుటుంబ సభ్యులు ఉన్నారు.

ఉపాధి కూలీలకు పే స్లిప్పులు రావట్లేదు..

- సర్వసభ్య సమావేశంలో సభ్యులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలో ఉన్న సుమారు 42 అంగన్వాడీ ఉపాధ్యాయుల పనితీరును మెరుగుపరచాల్సిన బాధ్యత ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్ట్, మండల సూపర్‌వైజర్ విజయ రాణిపై ఉందని ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ కొండెంగల అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందుగా మండల విద్యాశాఖ అధికారి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సౌకర్యాల మేరకు కృషి చేయాల్సిన అవసరం ఉందని సభ దృష్టికి తెచ్చారు. ఉపాధి కూలీలకు సరైన సమయంలో పేస్లిప్పులు ఇవ్వడం లేదని స్థానిక ఎంపీటీసీ షేక్ బాబా సభ దృష్టికి తెచ్చారు. సానుకూలంగా స్పందించిన ఉపాధి ఏపీఓ శివాని మాట్లాడుతూ.. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. సాంకేతిక లోపంతో కొన్ని గ్రామాల్లో కూలీల పేర్లు లేకపోవడం వాస్తవమేనని ఆమె అన్నారు. అన్ని గ్రామాల ఉపాధి కూలీలకు న్యాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం



మాట్లాడుతున్న దృశ్యం

ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయ రాణి మాట్లాడారు. 40 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని ఆమె సభ దృష్టికి తెచ్చారు. పోచారం బ్రాహ్మణపల్లి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో ఉపాధ్యాయులు లేరని, పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె గుర్తు చేశారు. మిగతా అంగన్వాడీ కేంద్రాల్లో ఉపాధ్యాయులతో పాటు ఆయాలు ఉన్నట్లు ఆమె వివరించారు. గర్భిణీ మహిళలు, బాలింతలు, చిన్నారి బాలబాలికలకు సైతం పౌష్టికార ంఅందిచడంతోపాటు ఆటపాటలు నేర్పించేందుకు అంగన్వాడీ ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మండలంలో సుమారు 5 అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. మంగళ్‌పహాడ్ గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రం ముందర గిడ్డంగి నిర్మించడం పట్ల అంగన్వాడీ కేంద్రం నుంచి గిడ్డంగి వరకు ఎత్తుపెంచడం వల్ల అంగన్వాడీ కేంద్రం డౌన్లోడ్‌కి వెళ్ళిపోయిందని ఆమె గుర్తు చేశారు. బాల, బాలికలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఇమ్రాన్, ఎంపీడీవో శంకర్‌నాయక్, స్వరూపరాణి, ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి, ఎంపీటీసీలు మనిషారెడ్డి, షేక్‌బాబా, వనజ నాగరాజు, గ్రామపంచాయతీ కార్యదర్శుల యూనియన్ అధ్యక్షులు ఉదయభాస్కర్, గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంగళ్‌పాడ్ గోదామ్‌ను ఇవ్వం

- ఎంపీటీసీ వనజ నాగరాజు, గ్రామ పెద్దలు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలం మంగల్‌పాడ్ రూర్బన్ పథకం కింద సుమారు 50లక్షలతో నిర్మించిన గోదాంను తాము సహకార సంఘానికి ఇవ్వలేమని ఎంపీటీసీ ఆరుగుల వనజ నాగరాజు, తాజా మాజీ సర్పంచ్ బట్టు హనుమాన్లు స్పష్టం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కే.శ్రీనివాస్ అధ్యక్షతన సర్వసర సమావేశాన్ని గురువారం నిర్వహించారు. సహకార సంఘం అధ్యక్షులు గోదాంను సహకార సంఘం పరిధిలోకి తీసుకుంటామని, ఇందుకు కలెక్టర్, సంబంధిత శాఖ అధికారులు తమకు ఉత్తర్వులు జారీ చేసినట్లు మల్కారెడ్డి, ఎంపీపీ కే.శ్రీనివాస్‌కు కాపీని అందజేశారు. మంగళ్‌పాడ్ గ్రామపెద్దలు. యువకులు సభలోకి చేరుకొని, సహకార సంఘం అధ్యక్షులు పొల మల్కారెడ్డితో స్వల్ప వాగ్వాదానికి దిగారు. గ్రామంలో రెండు గోదామలు ఉన్నాయని సహకార సంఘం ఎడపల్లి సొసైటీకి ఇస్తామని రాసి వినతి పత్రాన్ని అందజేశారు. రూర్బన్ పథకంలో నిర్మించిన గోదాం గిడ్డంగి కావాలని ఆయన పట్టు పట్టారు. చివరికి గ్రామస్తులు వాగ్వివాదానికి దిగారు. ఎంపీపీ వారిని సముదాయించారు. అనంతరం ఎంపీటీసీ అరుగుల వనజ నాగరాజు, మాజీ సర్పంచ్ బట్టు హనుమాన్లు మాట్లాడారు. రూర్బన్ పథకంలో నిర్మించిన గోదాం వల్ల గ్రామానికి గ్రామ పంచాయతీకి ఆదాయం వస్తుందని వారన్నారు. దీంతో గ్రామం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ విషయంలో కలెక్టర్‌ను తాము రెండుసార్లు కలిసి విన్నపాలు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఏదేమైనాప్పటికీ తాము నూతనంగా నిర్మించిన గోదాంను ఎడపల్లి సహకార సంఘానికి ఇవ్వబోమని అన్నారు.



వినతి పత్రాన్ని అందజేస్తున్న పలువురు

ఎంపీడీవో ఎస్ శంకర్కు ఎంపీటీసీ వనజ నాగరాజు మాజీ సర్పంచ్ బట్టు హనుమాన్లతో పాటు, గ్రామ పెద్దలు రాజేందర్ బండలింగారెడ్డి, మాణిక్యాల సురేష్‌గౌడ్,హెూం గంగాధర్ గౌడ్, సుప్పాల భూషణం, వినతి పత్రం సమర్పించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకర్ మాట్లాడారు. మంగళ్‌పాడ్‌లో ఉన్న గోదాం తాము రెండు మూడు రోజుల్లో సందర్శించి పరిశీలిస్తానన్నారు. శాంతియుతంగా ఉండాలని ఆయన కోరారు.

19న 1998-99 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-ముప్కాల్

ఈ నెల 19న ఆదివారం పదోతరగతి 1998-99 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'సిల్వర్ జూబ్లీ ప్రోగ్రామ్' నిర్వహిస్తున్నట్లు పాఠశాల పూర్వ విద్యార్థులు నవీన్, దిలీప్, భాగ్యలక్ష్మి, వాణి, సంధ్యలు గురువారం తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నటు తెలిపారు. పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు అందరూ పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు భాగ్యలక్ష్మి, వాణి, సంధ్య, నవీన్, దత్తు, దిలీప్, శ్రీహరి, కిరణ్, పవన్, కిషోర్, గంగాధర్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలకు నిప్పు పెడితే భూసారానికి దెబ్బ

నవతెలంగాణ-ఏర్గట్ల

యాసంగి వరి కోతల అనంతరం కొయ్యలను కాల్చడం వల్ల భూసారం దెబ్బ తింటుందని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ రైతులకు తెలిపారు. వరి కోతల అనంతరం పొలంలో మిగిలిన కొయ్యలకు, నిప్పు పెట్టి కాల్చి బూడిద చేయడం వల్ల, రైతుకు ఏ మాత్రం ప్రయోజనం ఉండదని అన్నారు. దీనివల్ల భూమి విపరీతంగా వేడెక్కి భూసారం కోల్పోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు కూడా మరణిస్తాయని, దీని వల్ల పంట దిగుబడి తగ్గే అవకాశం లేకపోలేదని చెప్పారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

లైసెన్స్ లేకుండా కల్లు దుకాణాలు నడిపితే

- చట్టరిత్యా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న గ్రామపెద్దలు

నవతెలంగాణ-వర్ని

లైసెన్స్ లేకుండా కల్లు దుకాణాలు నడిపితే చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని గ్రామపెద్దలు అన్నారు. చందూర్ మండల కేంద్రంలో లైసెన్స్ లేకుండా బ్లాక్‌లో కల్లు దుకాణాలు నడుపుతున్నారని, గ్రామంలో బెల్ట్ షాప్‌లు కూడా జోరుగా కొనసాగు తున్నందున మద్యం విచ్చల విడిగా అమ్మటంతో యువత మద్యానికి బానిసగా మారుతుందని ఎక్సైజ్ సిఐకి వినతి పత్రం అందజేశారు. బ్లాక్లో అమ్మే కల్లుగాని, బెల్టు షాపులు గాని గ్రామాల్లో ఉండకుండా తీసివేయాలని కేవలం లైసెన్స్ కలిగిన వారు మాత్రమే కల్లు అమ్మాలని అన్నారు. ఇతర గ్రామాలకు కల్లును తరలించకూడదని వినతి పత్రంలో సీఐని కోరారు. లేని పక్షంలో గ్రామ పెద్దలం నిర్ణయం తీసుకొంటామని తక్షణమే కల్లు దుకాణాలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

ఈవ్ టీజింగ్ చేస్తే షీటీంకు సమాచారం అందివ్వండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం కానిస్టేబుల్

నవతెలంగాణ-ఆర్మూర్

ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, ఈవ్ టీజింగ్ చేసిన షీ టీంకు సమాచారం ఇవ్వాలని షీ టీం కానిస్టేబుళ్లు, విగ్నేష్ అన్నారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాల నందు సైబర్ క్రైమ్ గురించి గురువారం విద్యార్థినిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాచారం ఇచ్చిన మహిళలు, విద్యార్థినిల పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈవ్ టీజింగ్‌కు గురయ్యేవారు భయపడకుండా సమాచారం ఇస్తే రక్షణ కల్పిస్తామన్నారు. షీ టీం నెంబర్ 8712659795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా షీ టీం వారికి ఫిర్యాదు చేసే విధానాన్ని మహిళలకు వివరించారు.అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సపాల్ ధనవేణి, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

పల్లె ప్రగతి పనులను పరిశీలించిన డిఎల్‌పిఓ

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం ఎరాజ్ పల్లి గ్రామంలో గురువారం డివిజన్ పంచాయతీ అధికారి సాయిబాబా పల్లె ప్రగతి కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని కంపోస్ట్ షెడ్డు, నర్సరీ, వైకుంఠధామాలను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఇంటి పన్నులు బకాయి లేకుండా వసూలు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ ఉన్నారు.



కంపోస్టుషెడ్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

ముఖ్యమంత్రిని కలిసిన మండల నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్ గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డితో కలిసి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సుంకెట రవి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించినట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు.



సీఎంతో మండల నాయకులు

సమాజంతో కలిసి డెంగ్యూని నియంత్రిద్దాం

- డిఏంఅండ్ హెచ్ఓ డాక్టర్ తుకారం రాథోడ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సమాజంతో కలిసి డెంగ్యూని నియంత్రిద్దాం అని డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ తుకారం రాథోడ్ అన్నారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా వైద్యశాఖ, జాతీయ కీటకం జనిత వ్యాధుల నియంత్రణ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం స్థానిక నర్సపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో జిల్లా స్థాయి జాతీయ డెంగ్యూ నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ హాజరై జండా ఊపి ప్రారంభించారు. ఈ అవగాహన ర్యాలీలో డెంగ్యూ వ్యాధి నియంత్రణకు సంబంధించన నినాదాలతో వీధుల గుండా కొనసాగింది. అనంతరం పట్టణ ఆరోగ్య కేంద్రంలో డెంగ్యూ వ్యాధిపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డాక్టర్ తుకారాం రాథోడ్ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం జాతీయస్థాయిలో కేంద్రం ఇచ్చిన నినాదం సమాజంతో కలిసి డెంగ్యూని నియంత్రిద్దాం అని అన్నారు. మూడు దోమల ద్వారా ఐదు రకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయని అందులో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా మెదడువాపు, బోదకాలు అన్నారు. కానీ జిల్లాలో కేవలం 115 డెంగి వ్యాధి కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. దీనికి కారణం పరిసరాల పరిశుభ్రత పాటించడం, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి లాంటి కార్యక్రమాలు నిర్వహించడం, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే ను నిర్వహించడం, రక్తపూతల సేకరణ ఇలాంటి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ఆశాలు, ఏఎన్ఎంలు, పర్యవేక్షక సిబ్బంది విస్తతంగా నిర్వహించడం ద్వారానే సాధ్యమైంది అన్నారు. దోమలు పుట్టకుండా, దోమలు కుట్టకుండా, చూసుకోవాలని అన్నారు. దోమతెరలను వాడడం, ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, పరిసరాల్లో నీటి నిలువని లేకుండా చూసుకోవడం, ఒకసారి వాడి పడేసిన ప్లాస్టిక్ సంచులు, కప్పులు, టైర్లు, పాత బకెట్లు, తొట్లు, కొబ్బరి బొండాలు, లాంటి వాటిలో నీటి నిలువ లేకుండా శుభ్రపరుచుకోవడం వాటిని తొలగించడం, నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్, వినియోగించడం ఇలాంటివి చేయాలని అన్నారు. గ్రామాలు, పట్టణాల్లో మురుగునీటి నిలవలు లేకుండా చూసుకోవడం, తొలగించడం ,వ్యాధులు ప్రబలినప్పుడు ఆశ, ఆరోగ్య సిబ్బందిని సంప్రదించడం లాంటివి చేయాలన్నారు. సిబ్బంది ప్రతి ఇంటింటిని సందర్శించి జ్వరంతో బాధపడే వారిని గుర్తించి వెంటనే చికిత్స అందించడం, డెంగ్యూ వ్యాధి రాకుండా జాగ్రత్తలు తెలియజేయడం, నిరంతరం అవగాహన కలిగించడం, రక్తపూతల సేకరణ, సమయానికి చికిత్స సౌకర్యాలు అందుబాటులో ఉంచడం లాంటివి జిల్లాలో విస్తతంగా చేపట్టడం జరుగుతు దన్నారు. డెంగ్యూ వ్యాధి ఈడిస్ ఈజిప్షన్ టైగర్ దోమ కాటు వల్ల వ్యాపిస్తుందని, వ్యాధి లక్షణాలుగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి, వాంతులు విరేచనాలు కండరాలను నొప్పులు రక్త విరోచనాలు రక్తస్రావం కావడం ప్లేట్లెట్లు తగ్గిపోవడం, కనుపాప వెనుక భాగంలో నొప్పి, రక్తంతో కూడిన మలం, మూత్రం, చర్మంపై ఎర్రటి దద్దుర్లు లాంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. పధానంగా డెంగ్యూ ఫీవర్, డెంగీ హేమరేజ్ ఫేవర్, డెంగ్యూ షాక్ సింద్రోమ్ లాంటి మూడు ప్రధాన స్థాయిల్లో తీవ్రతను బట్టి ఉంటుందన్నారు. ఏ జ్వరంలో అయినా ప్లేట్లెట్స్ సంఖ్య తగ్గుతుందని కావున వ్యాధిగ్రస్తులు ఎవరు భయందోనాలకు గురి కావద్దని, ద్రవపదార్థాలను విస్తతంగా తీసుకుంటూ కొబ్బరి నీళ్ళు, ద్రవరూపంలో ఆహారాన్ని తీసుకొని పారాసిటమోల్ వేసుకుంటూ విశ్రాంతి తీసుకుంటే తీవ్రతను తగ్గించవచ్చని అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సామ్రాట్ యాదవ్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి లక్షణాలు, ప్రస్తుతం ఎలాంటి డెంగ్యూ వ్యాధి నియంత్రణ చర్యలు చేపడుతున్నదీ వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి షేక్ సలీం, జిల్లా ఆరోగ్య విద్య బోధకులు ఘన్పూర్ వెంకటేశ్వర్లు, హెచ్ఇఓ శంకర్, ముక్తార్ హమ్మద్, పర్యవేక్షకురాలు శ్యామల, ఎల్‌టిఎస్ స్వామి, శ్రీనివాస్, షాదుల్లా వెంకటేష్ అనిత, ఏ రాజు బేగం, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో

సజావుగా ఎన్నికల ప్రక్రియ పూర్తి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పార్లమెంట్ (లోక్ సభ) ఎన్నికలు-2024 సందర్భంగా నిజామాబాద్ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రక్రియ శాంతియుతంగా సజావుగా నిర్వహించిన సందర్భంగా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యూటీఫ్) జిల్లా కమిటీ సభ్యులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరుగడంలో ఉపాధ్యాయుల కృషి కూడా విలువైనదని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న జిల్లాలోని ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. సత్యానంద్, ఓ. రమేష్, జిల్లా ట్రెజరర్ ఎం. మల్లేష్, జిల్లా కార్యదర్శులు జి.గంగాధర్, ఎన్. రాజారామ్, జి.ఆనందం, జిల్లా కమిటీ సభ్యులు ఈ.శ్రీనివాస్, సాన్ పెట్ గంగాధర్, ఎం. భాజన్న, ఎల్. శంకర్, ఎం. రవీందర్, టి. కపిల్ దేవ్ పాల్గొన్నారు.

ఒక నెల వేతనం చెల్లించండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అధికారులు, ఉద్యోగులందరికీ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రెవెన్యూ ఉద్యోగులకు చెల్లించిన విధంగా ఒక నెల వేతనం చెల్లించాలని ఎంప్లాయ్ జేఏసి పక్షాన గురువారం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు వినతిపత్రం అంద జేశారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించుటకు, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న జిల్లా ఉద్యోగ మిత్రులకు, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో అన్ని రకాల వసతులతో పాటు, భోజన సదుపాయాలు కల్పించి ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కృషి చేసిన జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్ గాంధీ హనుమంతును సన్మానించి, ధన్యవాదాలు తెలిపారు. అనంతరం, గత డిసెంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికలు, మొన్న జరిగిన లోకసభ ఎన్నికల్లో నెలరోజుల పాటు ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులు, ఉద్యోగులందరికీ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రెవెన్యూ ఉద్యోగులకు చెల్లించిన విధంగా ఒక నెల వేతనం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ అలుక కిషన్, వైస్ చైర్మన్ సంఘం అమృత్ కుమార్, టిఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, సహాధ్యక్షులు చిట్టి నారాయణ రెడ్డి, టీఎన్జీవో కేంద్ర బాధ్యులు పోల శ్రీనివాస్, ల్లా కోశాధికారి దేవి సింగ్, టిపిఎన్జీఎస్ సలహాదారులు ఆకుల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు పురుషోత్తం, జాఫర్ హుస్సేన్, జాకీర్ హుస్సేన్, సత్యం,ఉమా కిరణ్ పాల్గొన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎంపీయీస్ జేఏసీ నాయకులు

ఆరు నెలల జీతాలు ఇప్పించండి

- ఎంపీడీవోకు బాలనగర్ జీపీ కార్మికుల వినతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని బాలనగర్ గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు ఆరు నెలల నుంచి జీతాలు ఇవ్వడంలేదని గురువారం ఎంపీడీవో సతీష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా జీపీ కార్మికులు ఓల్లెపు గంగామణి, రెబ్బబూదేవి, కారోబార్ రెబ్బ శేఖర్ మాట్లాడుతూ.. గత ఆరు నెలల నుండి జీతాలు రావడం లేదని, జీతాలు ఇప్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అనంతరం కారోబార్ రెబ్బ శేఖర్ మాట్లాడుతూ..గ్రామ పంచాయతీ సిబ్బందికి గత ఆరు నెలల నుండి జీతాలు ఇవ్వలేకపోవటంతో కుటుంబపోషణకోసం అప్పుల పాలయ్యామని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆరు నెలల జీతం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఎంపీడీవో సతీష్ కుమార్‌ను వివరణ కోరగా బాలనగర్ గ్రామపంచాయతీ సిబ్బంది గత ఆరు నెలల నుంచి జీతాలు రావడం లేదని వినతిపత్రం ఇచ్చారని, ఈ సమస్యను పరిష్కరించాలని ఎంపీఓకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

ఐటిఐలో అడ్మిషన్‌కు నోటిఫికేషన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ ప్రభుత్వ ఉపాధి కల్పన, శిక్షణ శాఖ వారి పారిశ్రామిక శిక్షణా కేంద్రాలలో (ఐటిఐ) ఉచ్చితంగా అడ్మిషన్ పొంది వివిధ పారిశ్రామిక కోర్సులలో శిక్షణ పొందడానికి 2024 సంవత్సరానికి అడ్మిషన్లు ఈనెల 16 నుండి ప్రారంభమైనవని జిల్లా కన్వీనర్, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటిఐ) (బాలురి), నిజామాబాద్ ప్రిన్సిపాల్ ఎం.కోటిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో ఐదు(5) ప్రభుత్వ ఐటిఐల్లో 1028 సీట్లు, మూడు (3) ప్రైవేటు ఐటిఐల్లో 488 సీట్లు ఉన్నాయని తెలిపారు. 14 సంవత్సరాలు పైబడిన అభ్యర్థులు అర్హులని, వయస్సు పరిమితులు లేవని, ధరఖాస్తు చేసుకోవడానికి జూన్ 10 వరకు వెబ్ సైట్ %ఫ్త్రజూం://ఊఙ్.వశ్రీఖఅస్త్రుఖ.స్త్రశీజ.ఱఅ% లో రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఐటిఐ కోర్సు ప్రతిపాధికన వెబ్ ఆప్షన్స్ పెట్టి, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని తెలిపారు. మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, వెబ్ ఆప్షన్స్ ఆధారంగా సీట్లు కేటాయించబడతాయని పేర్కొన్నారు. సీటు పొందడానికి మరిన్ని ఐటిఐలు కోర్సులను వెబ్ ఆప్షన్స్ పెట్టాలని తెలిపారు. ధరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తమ ఎస్ఎస్సి మెమో ప్రకారం పేరు, పుట్టిన తేదీ ఆధార్ కార్డులో ఉండేలా చూసుకుని ధరఖాస్తును సమర్పించాలని పేర్కొన్నారు. ధరఖాస్తు చేసే సమయంలో ఉపయోగించిన మొబైల్ (సెల్) నెంబర్, ఇ- మెయిల్‌లను ఐటిఐ కోర్సు పూర్తి అయ్యేవరకు మార్చరాదని, ఒకవేళ మర్చితే సీటు రద్దు చేయబడుతుందని వివరించారు. మరిన్ని వివరాలకు ఈ ఫోన్ నెంబర్ 9948195654, 9490057403 లకు సంప్రదించాలని తెలిపారు.

60శాతం సబ్సిడీపై జీలగ విత్తనాలు సిద్ధం

- మండల వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి

నవతెలంగాణ-రెంజల్

తెలంగాణ ప్రభుత్వం రైతులకు 60శాతం సబ్సిడీ పైన జీలుగ విత్తనాలను సరఫరా చేస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. జీలుగ కావలసిన రైతులు స్థానిక వ్యవసాయ విస్తీర్ణ అధికారుల వద్ద పరిమిషన్ తీసుకొని ఆయా సొసైటీలలో జీలుగ విత్తనాలను 60శాతం సబ్సిడీపై పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. 30 కిలోల జీలుగ విత్తనాల ధర 2790 రూపాయలు కాగా 60 శాతం సబ్సిడీ పోగా, రైతులు 1116 రూపాయలు చెల్లించి తీసుకోవా లన్నారు. ప్రస్తుతం రెంజల్ సొసైటీ పరిధిలో 83 బస్తాలు, దూపల్లి సొసైటీ పరిధిలో 83 బస్తాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఇంకా కావలసిన రైతులు తమకు సమాచారం అందించి నట్లయితే తెప్పించి అందజేయడం జరుగు తుందని ఆయన పేర్కొ న్నారు.

శ్రీలంకలో నిర్వహించే టెన్నిస్ బాల్ క్రికెట్ ఛాంపియన్ ట్రోఫీకి జక్రాన్‌పల్లి యువకుడు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

శ్రీలంకలో నిర్వహించే టెన్నిస్ బాల్ క్రికెట్ ఛాంపియన్ ట్రోఫీ 2024 కు జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన యువకుడు అఖిల్ వెళ్తున్నట్టు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సొప్పరి వినోద్ తెలిపారు.

అఖిల భారత జట్టు టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీకి శ్రీలంకలో జరగనుందని, ఈ టోర్నీ శ్రీలంక టెన్నిస్ బాల్ క్రికెట్ ఫెడరేషన్ ఫర్ టెన్నీస్ బాల్ క్రికెట్ ఛాంపియన్ ట్రోఫీ 2024 మెన్స్ అండ్ ఉమెన్స్ కొలంబోలో ఈనెల 16 నుంచి 20 వరకు నిర్వహిస్తారని చెప్పారు. ఈ ట్రోఫీకి టెన్నిస్ బాల్ క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డిపార్ట్‌మెంట్ ఆఫ్ యూత్ అండ్ స్పోర్ట్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన అఖిల్ భారత జట్టు తరపున టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు వెళ్లడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు



క్రీడాకారుడు అఖిల్

బందెల నర్సయ్య మరణం ఉద్యమానికి తీరని లోటు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

డిహెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ బందెల నర్సయ్యకు సీపీఐ నాయకులు గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో విప్లవ జోహార్లు అర్పించారు. కామ్రేడ్ బందెల నరసయ్య కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు, తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మృతిచెందగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. నర్సయ్య రాష్ట్రంలోని అనేక జిల్లాలలో దళిత దళితక్కుల పోరాట సమితిని విస్తరింపజేస్తూ దళితుల ఆత్మగౌరవ ఇమ్మడింపచేస్తూ దళిత ఉద్యమాన్ని నిర్మించాడని తెలిపారు. గత రాష్ట్ర మహాసభలో డిహెచ్పిఎస్ సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారని అన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నిర్వహించిన పోరాటాలను క్రియాశీలంగా పనిచేశారన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 9న మరణించారని తెలిపారు. ఆయన మరణం దళిత హక్కుల పోరాట సంఘానికి, దళిత ఉద్యమానికి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు కంజర భూమన్న ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య, ఏఐఎస్ఏఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం అధ్యక్షురాలు అంజలి, డిహెచ్పిఎస్ గౌరవ అధ్యక్షులు ముత్యాలు, కోశాధికారి పి నర్సింగరావు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొంబాయి గంగన్న, మోపాల్ సిపిఐ మండల కార్యదర్శి మేకల సాయిలు, పాకాల రవి, శ్రీను, వాగ్ మార్ నాగేశ్వర్ పాల్గొన్నారు.

మగ్గం శిక్షణతో జీవితంలో స్థిరపడ్డారు

- మగ్గం శిక్షణ ముగింపు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

శిక్షణా కార్యక్రమాలు చాలా మంచి నాణ్యతతో ఇస్తున్నామని, ఎంతో మంది ఇక్కడ శిక్షణా తీసుకొని జీవితంలో స్థిరపడ్డారని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఘన్పూర్ శివారులోని అర్ఎస్ఈటిఐ శిక్షణ కేంద్రం లో స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మగ్గం వర్క్ శిక్షణా ముగింపు కార్యక్రమం నిర్వహించారు. 30 రోజుల శిక్షణలో భాగంగా అనునిత్యం మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా అందజేసిన శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ శిక్షణపొందినవారికి ధృవీకరణ పత్రాలు, టూల్ కిట్‌లను అందజేశారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ ఆర్ఎస్ఈటిఐలో మగ్గం వర్క్ శిక్షణకు మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ఈ శిక్షణ అనంతరం వర్క్ వేయడం ద్వారా జీవితంలో స్థిరపడాలని సూచించారు. షాప్ పెట్టుకోవాలనుకునే వారికి బ్యాంక్ ద్వారా రుణసదుపాయం కూడా కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 30 మంది ఈ బ్యాచ్‌లో మగ్గం వర్క్ నేర్చుకున్నారని, మీ గ్రామాలలో ఉండే నిరుద్యోగ యువతకు ఈ సంస్థ గురించి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది భాగ్య లక్ష్మి, రామకృష్ణ, ఫేకల్టి నవీన్, రంజీత్,ఫారిధ, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ ఓవర్సీస్ స్కాలర్షిప్ స్కీంకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నేషనల్ ఓవర్సీస్ స్కాలర్షిప్ స్కీం కింద ఉన్నత చదువులు 2024-25 సంవత్సరం గిరిజన విద్యార్థిని విద్యార్థుల నుండి అన్ లైన్ వెబ్ సైట్ https://overseas.tribal.gov.in నుండి దరఖాస్తులు ఈనెల 31 వరకు స్వీకరించనున్నట్లు జిల్లా గిరిజన శాఖ అభివృద్ధి అధికారి టి.నాగోరావ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ వారి వెబ్సైట్ https://overseas.tribal.gov.in హైదరాబాద్ నందు సంప్రదించాలని పేర్కొన్నారు.

17న వాహనాల వేలంపాట

నవతెలంగాణ-మోర్తాడ్

మోర్తాడ్ ఎక్సైజ్ పరిధిలో పట్టుబడిన రెండు వాహనాలను ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు మోర్తాడ్ ఎక్సైజ్ సీఐ గుండప్ప గురువారం తెలిపారు. రెండు ఎలక్ట్రికల్ వెహికల్ వాహనాలను వేలంపాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొని వాహనాలను పొందవచ్చని తెలిపారు. మోర్తాడ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఈ వేలంపాట నిర్వహించడం జరుగుతుందని ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొనాలని ఎక్సైస్ సీఐ గుండప్ప తెలిపారు.

బిఆర్ఎస్ పార్టీ నుండి ఒకరి సస్పెండ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ నియోజకవర్గం లోని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రాంగి మండలం మానాల పరిధిలోని బడి తండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గుగులోత్ నరేష్‌ను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దేగావత్ తిరుపతి గురువారం తెలిపారు. గత కొంతకాలంగా పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నందున పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు నరేష్ ను సస్పెండ్ చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని బాల్కొండ నియోజకవర్గ నాయకులంతా గమనించాలని ఆయన కోరారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కోటగిరి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మండల పరిషత్ అధ్యక్షురాలు వల్లేపల్లి సునీత అధ్యక్షతన నిర్వహించారు వివిధ శాఖ అధికారులు వారి నివేదికలను చదివి విని పించారు. అనంతరం మండల పరిషత్ అధ్యక్షురాలు మల్లేపల్లి సునీత మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాల నుండి సహకరించిన అధికారులు, పాలక సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే సభ్యులకు ఇదేవిధంగా సహకరించాలని అన్నారు. ఉమ్మడి మండల అభివృద్ధికి తనవంతు కృషి చేశానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి మనోహర్ రెడ్డి, వైస్ ఎంపీపీ బాలగంగాధర్, మండల విద్యాధికారి నాగనాథ్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

అడ్మిషన్ల పేరుతో డొనేషన్లు వసూలు చేస్తే ఆందోళనలు తప్పవు :ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో అడ్మిషన్ల పేరుతో డొనేషన్లు వసూలు చేస్తే ఆందోళనలు తప్పవని ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నిజామాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం రైల్వే స్టేషన్ వద్ద ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో అడ్మిషన్ల పేరుతో వేల రూపాయలు కొన్ని పాఠశాలలు డొనేషన్లు వసూలు చేస్తున్నాయని తెలిపారు. విద్యాశాఖ అధికారు డొనేషన్లు వసూలు చేస్తున్న పాఠశాల పైన స్పందించి చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ నుండి అనుమతులు లేకుండా అడ్మిషన్ నిర్వహిస్తున్న పాఠశాల పైన విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకొని ఆ విద్య సంస్థ యజమాన్యం పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అన్నారు. సమావేశంలో ఏఐఎస్ఏఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, నాయకులు కుషాల్, నవీన్, వంశీ, టోకు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

- రెంజల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గ్రామానికి చెందిన బొల్లెల అనిల్ (28) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై సాయన్న కథనం ప్రకారం.. గత కొన్ని సంవత్సరాలుగా అనిల్ చెల్లెలు, బావ బసవరాజ్ ఆయనకు సంబంధించిన మూడు ఎకరాల 20 గుంటల భూమిని కౌలుకు చేస్తూ ఉండేవాడు. కౌలు డబ్బుల కోసం వెళ్లిన అనిల్‌పై చెల్లి బావతో పాటు, సంతోష్ దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కౌలు డబ్బులతో పాటు తన పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని అనిల్ వారితో గొడవ పడడంతో కొట్టినట్లు నానమ్మ పేర్కొంది. తన మనవడి మరణం అనుమానస్పదంగా ఉందని, ఆ ముగ్గురు వ్యక్తులే కారణమంటూ ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. మృతుడి నానమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

కార్మికులకు ఐఎన్‌టియూసి అండ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రానున్న రోజుల్లో ఐఎన్‌టీయుసీని బలేపేతం చేస్తామని నిజామాబాద్ జిల్లా ఐఎన్టీయూసీ కమిటీ పేరుకుంది.. అన్ని రంగాల్లోని కార్మికులకు ఉపాధి కల్పించే బాధ్యతతో ఐఎన్టీయూసీ ద్వారా పోరాటం చేస్తామని యూనియన్ ప్రతినిధులు తెలిపారు. నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐఎన్‌టియుసి జిల్లా కమిటీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా ఐఎన్టియుసి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన ఐఎన్‌టియుసి జిల్లా కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్.రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అన్నివర్గాల కార్మికులను అన్యాయం చేసిందని అన్నారు. అన్ని రంగాల కార్మికులకు ఉపాధి కల్పించేందుకు తమ వంతుగా ఐఎన్‌టియుసి కమిటీ ద్వారా పోరాటం చేస్తామని ఆయన తెలిపారు. గౌరవ అధ్యక్షుడు తాటికొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మణ్ చారి, కోశాధికారి మహేందర్ గౌడ్, ఉపాధ్యక్షుడు రాజు, స్వామి, కమిటీ సభ్యులు రాము, పవన్, రాజు, డాలర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.